క్లుప్తంగా

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోవాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక సూచించారు. శనివారం మండలంలోని బిజనవేముల గ్రామ శివారులోని జగనన్న కాలనీలో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలతోపాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, కడ్డీలు, గృహ నిర్మాణ సామాగ్రి అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ సుదర్శన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: దోమలవ్యాప్తి వల్ల ప్రబలే మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు సూచించారు. శనివారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్ కార్యకలాపాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, హెల్త్‌సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి పాల్గొన్నారు.

ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు



డిప్ ఫిల్టర్, పరికరాల గురించి రైతుకు వివరిస్తున్న అధికారులు

డోన్ టౌన్ : అవసరం ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీపై బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉద్యాన వన శాఖ ఓఎస్‌డీ టెక్నికల్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఓబులాపురం, ప్యాపిలి మండలంలోని జలదుర్గం, మాధవరం గ్రామాల్లో 2022-23 సంవత్సరానికి మంజూరైన డ్రిప్ పరికరాలను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీడీ సత్యనారాయణ, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రక్త దానం

డోన్ టౌన్: కర్నూలు గౌరీగోపాల్ ఆసుపత్రిలో ఆళ్లగడ్డకు చెందిన కరీంబాషాకు డయాలసిస్ నిమిత్తం రక్తం అవసరం కాగా ద్రోణాచలం సేవా సమితి సభ్యులు స్పందించారు. సమితి సభ్యుడు మాబాషా శనివారం కర్నూలుకు వెళ్లి రక్తం దానం చేశాడు. 20వసారి బీ పాజిటివ్ రక్తదానం చేసిన మాబాషాను మిత్రులు అభినందించారు.

విద్యార్థులకు సత్కారం

డోన్ టౌన్: ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాల స్థాయిలో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన మండల విద్యాధికారి ప్రభాకర్ ఘనంగా సత్కరించారు. సాయికౌశిక్, దాదా సయ్యద్, జయ నరసింహలకు వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి రుపాయలను ప్రభుత్వం అందించగా హెచ్‌ఎం అదనంగా రూ.1,000, రూ.750, రూ. 500 కలిపి విద్యార్థులకు అందించారు. అనంతరం తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వెంకటరమణ, లక్ష్మీ ప్రభావతి పాల్గొన్నారు.

ఐటీఐకి డీజీటీ అఫిలియేషన్ అనుమతులు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి డీజీటీ అఫిలియేషన్ న్యూ ఢిల్లీ వారిని అనుమతులు వచ్చాయని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మంజూరైన ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రిషన్, పిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్ కోపా ట్రేడ్లు డీజీటీ నామ్స్ ప్రకారం న్యూఢిల్లీ కమిటీ నుంచి ఈనెల 15 వ తేదీన అనుమతి పత్రం వచ్చిందన్నారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఏటీఓలు బుగ్గన సురేష్‌రెడ్డి, మనోహర్, భరత్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు.

రెండు ఇళ్లలో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరాంనగర్‌లో రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. కాలనీకి చెందిన రాంపల్లె వెంకట్రాముడు, లక్ష్మీదేవి దంపతులు ఇంటి వరండాలో శుక్రవారం రాత్రి నిద్రిస్తుండగా నలుగురు వ్యక్తులు అర్ధరాత్రి వరండాలోకి దూకి నిద్రిస్తున్న లక్ష్మీదేవి మెడలోని మూడు తులాల బంగారం చైన్, వెంకట్రాముడి సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. అలాగే పక్కింటిలో నివాసం ఉంటున్న ఆంజనేయులు ఇంటిపై నిద్రిస్తుండగా సెల్‌ఫోన్ అపహరించక పోయినట్లు బాధితులు తెలిపారు. వెంకట్రాముడు ఇంటిలో ఉన్న సీసీ కెమరాల ద్వారా దొంగతనానికి పాల్పడిన నలుగురిలో ఓ వ్యక్తిని గుర్తించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ నగేష్ తెలిపారు.

పేదలందరికీ పక్కాగృహం

డోన్ టౌన్ : పేదలందరికీ పక్కాగృహం నిర్మించి ఇవ్వాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం హౌసింగ్ ఏఈ నాగభూషణం సమక్షంలో హౌసింగ్, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలన్నారు.

వైఎస్సార్ బీమా.. పేదల ధీమా!

- బాధిత కుటుంబాలను అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- భరోసానిస్తున్న బీమా సాయం
- అత్యక్రియలకు తక్షణ సాయంగా రూ. 10 వేలు



పంచమపేటలో నామినీకి తక్షణ ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



పవర్‌హౌస్ సమీపంలో నామినీకి తక్షణ ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తుంది. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వారి కుటంబ భద్రపై దృష్టి సారించింది. అనుకోని పరిస్థితుల ప్రభావం మూలంగా మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తుంది. ఆదాయ వర్గాలకు ఉన్న బీమా పాలసీలను పేదలకు కూడా వర్తించేలా చర్యలు చేపట్టింది ప్రభుత్వం. విధి వక్రీకరించి మృతి చెందినా, అంగవైకల్యం కలిగిన పేద కుటుంబాలకు అండగా నిలుస్తుంది. రెండు సంవత్సరాల క్రితం వైఎస్సార్‌బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ సంవత్సరం క్షేత్రస్థాయిలో రెన్యువల్ సర్వే ప్రారంభించి ఈ నెల 14 నాటికి పూర్తి చేసింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లీ రేషన్‌కార్డు కుటుంబాల వివరాలను సేకరించి సర్వే పూర్తి చేశారు కూడా.

తక్షణ సాయంగా రూ.10 వేలు

పేద కుటుంబాల జీవనం ఆర్థిక ఇబ్బందుల మయం. రెక్కాడితేగాని డొక్కనిండని పేదలు అనుకోని పరిస్థితుల్లో అంత్యక్రియలకు వారుపడే ఇబ్బందులను తొలగిస్తుంది. బీమా వర్తింపు సభ్యుడు మృతి చెందితే తక్షణ సాయంగా రూ. 10 వేలు అందజేస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది. అనంతరం నామినీ బ్యాంక్ ఖాతాలో నేరుగా మిగిలిన మొత్తాన్ని జమ చేసి బాధిత కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తూ ఆదుకుంటుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

నమోదు ఇలా

బీమా పథకాన్ని వైఎస్సార్ క్రాంతిపథకం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేస్తున్నారు. నియోజకవర్గంలో 87,991 రేషన్‌కార్డుదారులు ఉండగా ఇందులో 80,796 బీమాకు అర్హులుగా ఉన్నారు. వీరిలో 73,243 మందికి బీమా రెన్యువల్ చేయడం జరిగింది. లబ్ధిదారుల వేలిముద్ర, ముఖకంటి ఓటీపీ ఆధారంగా రెన్యువల్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

పథకానికి అర్హత ఇలా

- రేషన్‌కార్డు కలిగి ఉండాలి. ఇంటిలో సంపాదించే వ్యక్తికి బీమా లభిస్తుంది.
- భర్త చనిపోయిన చోట ఆయన భార్య కుటుంబాన్ని పోషిస్తే భార్య పేరిట బీమా ఉంటుంది. పిల్లలు వృద్ధులు నామినీగా ఉంటారు.
- గ్రామీణ ప్రాంతాల్లో నెల ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేలు ఉండాలి.
- మాగణి మూడు, మెట్ట 10 ఎకరాలకు మించకూడదు.
- పాలసీదారులకు గుర్తింపు కార్డును ప్రభుత్వమే అందజేస్తుంది.

ప్రయోజనలు ఇలా...

- వైఎస్సార్ బీమా పథకం 18-70 ఏళ్లలోపు కలిగిన రేషన్ కార్డుదారులకు వర్తిస్తుంది.
- 18-50 ఏళ్ల మధ్య సహజమరణం పొందితే నామినీకి రూ. లక్ష బీమా మొత్తం వస్తుంది.
- ప్రమాదశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన రూ. ఐదు లక్షల బీమా లభిస్తోంది.
- 51-70 ఏళ్ల వ్యక్తులు ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన రూ. ఐదు లక్షల బీమాను వారసులకు చెల్లిస్తారు.

మండలాలవారీగా బీమా వివరాలు

మండలం	మొత్తం కార్డుదారులు	అర్హులు
బనగానపల్లె	30,547	28,201
అవుకు	15,720	14,211
సంజామల	12,214	10,970
కోవెలకుంట్ల	13,628	12,648
కొలిమిగుండ్ల	15,882	14,721

వైఎస్సార్ బీమా భరోసానిచ్చింది...



మాది నీరుపేద కుటుంబం. బనగానపల్లెలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా అమ్మ మహబూబ్‌బీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం సమీపంలో ప్రమాదశాత్తు మోటార్ సైకిల్ ప్రమాదంలో మృతి చెందింది. పెద్దదిక్కును కోల్పోయాం. ఏమి చేయాలో అర్థమవ్వని పరిస్థితి. ఇదే సమయంలో రూ.5 లక్షల వైఎస్సార్ ప్రమాద బీమా సౌకర్యం లభించింది. ఈ మొత్తం మా కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చింది. కష్టకాలంలో అందని ప్రభుత్వ సాయం మరువలేనిది. – గౌసియా, బాధిత కుటుంబ సభ్యురాలు,బనగానపల్లె

కుటుంబానికి అండగా



మాది బనగానపల్లె. మా తల్లి మట్టా నాగలక్ష్మీ మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. అమ్మ మరణం మా కుటుంబాన్ని కలచివేసింది. అయోమయానికి గురయ్యాం. సహజ మరణం కింద ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్ష అందజేసింది. ఈ మొత్తం మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించింది. – లక్ష్మీదేవి, బాధిత కుటుంబ సభ్యురాలు,బనగానపల్లె

సద్వినియోగ పరచుకోవాలి



వైఎస్సార్‌బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సక్రమంగా సద్వినియోగపరచుకోవాలి. బీమా సర్వేలో నియోజకవర్గంలో మంచి ఫలితాన్ని సాధించింది. వైఎస్సార్ బీమా ద్వారా సహజమరణానికి రూ. లక్ష, ప్రమాదశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5లక్షల వరకు బీమా లభిస్తుంది. ఈ మొత్తం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం. – శివరామయ్య, ఎంపీడీఓ, బనగానపల్లె మండలం

కోలుకోలేక వ్యక్తి మృతి

కోవెలకుంట్ల: స్థానిక నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో ఈ నెల 14వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు. సంజామల మండలం పేరుసోములకు చెందిన రామచంద్రారెడ్డి(49), కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన చలమయ్యతో కలిసి మిరపనార కొనుగోలుకు నంద్యాల వైపు బైక్‌పై వెళ్తూ రేవనూరు గ్రామ సమీపాన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నంద్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రామచంద్రారెడ్డి మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలో పలుకూరు క్రాస్ రోడ్డు వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. పండ్లాపురం గ్రామానికి చెందిన ఆకులరంగయ్య, ఆకుల జగదీశ్వరుడు బొలెరో వాహనంలో 30 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని బనగానపల్లె వైపు తరలిస్తుండగా సమాచారం మేరకు తనిఖీ చేసి బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశామన్నారు. బియ్యం సేకరణ, తరలింపు వివరాలపై ఆరా తీస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

బేతంచెర్ల: రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు అధిక లోడుతో వెళ్తే కేసులు నమోదు చేస్తామని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం బేతంచెర్ల కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని, అధికలోడుతో వెళ్తున్న, రికార్డులేని 11 వాహనదారులపై కేసులు నమోదు చేసి రూ.1,75,400 జరిమానా విధించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి

- ఆర్డీఓ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : జాతీయ రహదారి 340-బీ రోడ్డు నిర్మాణం పనులకు అవసరమైన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచిచారు. స్థానిక కార్యాలయంలో శనివారం డోన్, బేతంచెర్ల తహసీల్దార్లు విద్యాసాగర్, నరేంద్ర నాథ్‌రెడ్డితో కలిసి ఆయన వీర్వోలు, సచివాలయం సర్వేయర్లతో భూ సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ హైవే టూ హైవే కనెక్షన్ నేపథ్యంలో డోన్ యు.కొత్తపల్లె వై జంక్షన్ 44వ జాతీయ రహదారి నుంచి బేతంచెర్ల మండలం మీదుగా హుసేనాపురం సమీపంలోని సోమయాజులపల్లె కర్నూలు చిత్తూరు జాతీయ రహదారి వరకు 52 కిలోమీటర్ల మేరా లింక్ జాతీయ రహదారిని(430.బీ) నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం 8 రెవెన్యూ, మజరా గ్రామాలకు చెందిన 366 మంది రైతుల నుంచి 171.675 ఎకరాలు సేకరించాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యదర్శులు రైతుల ఆధారాలు, పాస్ బుక్‌లు, ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ రికార్డులతో సరిచూసి నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ, వ్యవసాయేతర, ఇంటి స్థలాలు, రోడ్డు ప్రక్కన వ్యవసాయ భూముల ప్రకారం నాలుగు రకాలుగా విభజిస్తు వాటి విలువను లెక్కించే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో డోన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ డీలర్ల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

బనగానపల్లెరూరల్: వ్యవసాయంలో ఖర్చులను తగ్గించడంలో విత్తన, ఎరువుల వ్యాపారుల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె సమీపానున్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఇన్‌పుట్ డీలర్ల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. డీలర్స్ రైతుల పొలాలను తప్పనిసరిగా సందర్శించి, పంటల సాగులో వచ్చే సమస్యలకు తగిన పరిష్కారాలను చూపించాలన్నారు. మరో విశిష్ట అతిథి ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వరలక్ష్మీ మాట్లాడుతూ డీలర్లు వ్యవసాయంలో వస్తున్న సాంకేతికను అందిపుచ్చుకుని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీఏ విశ్వనాథ్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

పలుకూరులో అతిసారం లక్షణాలు!

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరులో రెండు రోజుల నుంచి అతిసారం లక్షణాలతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, విరేచనల మూలంగా బాధితులు పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బనగానపల్లె ఏరియా ఆసుపత్రి చికిత్స పొందుతున్నారు. 32 మందికి వైద్య చికిత్సలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందిలేదన్నారు. కలుషితమైన నీరు తాగడం, ఫుడ్ పాయిజన్ మూలంగా కూడా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉందని డాక్టర్ తెలిపారు. నంద్యాల జిల్లా పంచాయతీ ఆఫీసర్ మంజులవాణితో పాటు బనగానపల్లె ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, డాక్టర్ మౌనిక టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సూచనలు చేశారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని కేటాయించి ఇంటికి వెళ్లి పరీక్షలు చేయించారు. అలాగే ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. నీటి పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండం శేషిరెడ్డి పీహెచ్‌సీకి వెళ్లి బాధితులను పరామర్శించారు.

నాలుగు రోజుల్లోనే టీడీపీకి షాక్!

- సొంత గూటికి చేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



సొంతగూటికి చేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలోకి కార్యకర్తలు చేరారని సంబరపడిన టీడీపీ నాయకులకు నాలుగు రోజుల్లోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు షాక్ ఇచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, రాజా మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా సొంత గూటికి చేరిన వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రపల్లి పెద్ద మల్లికార్జున, మల్లేశ్, చెంచుగారి శ్రీనివాసులు, తమ్మన్న గారి నాగన్న, రంగస్వామి, చిన్నా తదితరులు మాట్లాడారు. అత్యవసరంగా మాట్లాడాల్సి ఉంది... టీడీపీ కార్యాలయానికి రావాలని ఆ పార్టీ వారు చెప్పడంతో వెళ్లామన్నారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత ఆకస్మాత్తుగా తమకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి చేరినట్లు ప్రకటించడంతో ఆశ్చర్యపోయామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గండికోట రామాంజనేయులు, బోరెడ్డి కృష్ణారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

బేతంచెర్ల: వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దు అకాడమీ సభ్యుడు మూర్తు జావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురంలో ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ గుమ్మగాల్లరాజు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, ఎంపీటీసీలు నాగేషు, వెంకట సుబ్బమ్మ, కోఆప్షన్ సభ్యులు రహంతుల్లా ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీడీఓ వలంటీర్లకు పురస్కారాలు, మెడల్స్ అందజేసి శాలువలతో సత్కరించారు. ఏకార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ ,వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, బాయి కాటి మోహన్ రెడ్డి, తిమోతి, ఈశ్వర్‌రెడ్డి, గోవర్ధన గిరి శేఖర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రజలతో ప్రజా ప్రతినిధులు మమేకమైందేకే సీఎం జగనన్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని, మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే అధికారులతో కలిసి మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మండలంలోని పసుపల గ్రామంలో శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి గ్రామ ప్రజల నుంచి అపూర్వస్వాగతం లభించింది. ఎంపీపీ మానసవీణ, సర్పంచ్ మోహన్‌బాబు, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ హేమలతారెడ్డి, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడప వద్దకు వెళ్లి ప్రభుత్వ పాలన తీరును వివరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకురావాలని, పరిష్కార చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే సీఎం లక్ష్యమని, ఈ నేపథ్యంలోనే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని గుర్తు చేశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు వర్తించాయా... లేదా అని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడగ్గా ప్రతిఒక్కరూ సంతోషంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. బీసీ కాలనీ, బస్టాండ్ నుంచి మసీదు వరకు, కొత్తకాలని కోట్ల వీధి, పోస్టల్ వీధి ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకురాగా పరిష్కార చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గతేడాది జిల్లాలో ఏ రైతుభరోసా కేంద్రానికి లేనివిధంగా పసుపల ఆర్‌బీకే నుంచి రికార్డు స్థాయిలో 960 మెట్రిక్‌టన్నుల ఎరువులను పంపిణీ చేశామని గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎవరి ప్రమేయం లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాల మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని, ఓర్వలేని టీడీపీ నాయకులు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, హౌసింగ్ ఏఈ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్, కుళ్లాయిస్వామి, రాజేశ్వరప్ప, నాగేంద్ర, ఈశ్వరయ్య, రామయ్యగౌడ్, బాలమద్దిలేటి, నాగలింగప్ప, జంబయ్య, నాగేశ్వరప్ప, చాకలి శ్రీను, రామనాయుడు, ముల్లా రబ్బాని బాషా, మౌలాలీ, జయరాముడు, పుల్లయ్యగౌడ్, రామస్వామి, ఎర్రన్న బూత్ కన్వీనర్ పెద్దిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం



రూ.24 లక్షల విలువ వాహన పత్రాలను సభ్యులకు అందజేస్తునన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: కుల వృత్తులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తుందని, వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద సంజామల మండలం గిద్దలూరు మత్సకార సంఘానికి మంజూరైన రూ. 24లక్షల విలువ ఐచర్(ట్రక్)-3012 వాహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. వాహనానికి సంబంధించిన పత్రాలను సంఘం సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ప్రభుత్వం కులవృత్తుదారుల వ్యాపార అభివృద్ధికి వాహనాలను సబ్సిడీపై అందజేస్తుందన్నారు. మత్సకార సంఘానికి రూ. 24లక్షల విలువ చేసే వాహనంలో రూ.13లక్షల సబ్సిడీ సౌకర్యం లభించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నంద్యాల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ పోచా శీలారెడ్డి, సంజామల మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, గిద్దలూరు మత్సకార సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, సంఘం అధికారి శ్రీనివాసులు, సభ్యులు వెంకటప్రసాద్, పెద్ద వెంకటేశ్వర్లు రాజశేఖర్, చిన్నరమణ, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం



రూ.5లక్షల ఎల్ఓసీని అందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పేద ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు అన్నారు. గుండె ఆపరేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఎల్ఓసీ కింద మంజూరు చేసిన రూ.5లక్షల ఆర్డర్ పత్రాలను బాధితులకు శనివారం వారు అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన వడ్డే రామ్మోహన్ కుమార్తె మంజుల రాజ్యలక్ష్మీ గుండె జబ్బుతో బాధపడుతుంది. ఆర్థిక సమస్యలను సర్పంచ్ విద్య, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ప్రత్యేక చొరవతో ఎల్ఓసీ కింద వెంటనే రూ.5లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆణిముత్యాల పురస్కారాలు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ఇద్దరు విద్యార్థినీలకు జిల్లా స్థాయి ఆణిముత్యాల పురస్కారాలు ప్రధానం చేసినట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటిస్వామి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో కళాశాలకు చెందిన అమృత సీనియర్ ఎంపీసీ గ్రూపులో 973 మార్కులు, హెచ్ఈసీలో షబియాబీ 957 మార్కులు సాధించి జిల్లాస్థాయి టాపర్లుగా నిలిచారన్నారు. జిల్లాస్థాయి ఆణిముత్యాల పురస్కారానికి ఎంపిక కావడంతో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల నగదు పురస్కారంతోపాటు అవార్డులు ప్రధానం చేశారన్నారు.

పశుబీమా పాడి రైతులకు వరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి

బనగానపల్లెరూరల్: వైస్సార్ పశు బీమా పాడి రైతులకు వరంలాటిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం ఏడీఏ డాక్టర్ మారుతి సకారామ్ అధ్యక్షతన బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, బేతంచర్ల, ప్యాపలి, డోన్ పశువైద్యశాలల వైద్యులు, పారా వెటర్నరీ సిబ్బంది, గ్రామ పశువైద్య సహాయకులు, గోపాల మిత్రలకు వైఎస్సార్ పశుబీమాపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పాడి రైతులు, గొర్రెల పెంపకందార్లుకు ఈ పథకం ఉపయోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఉపసంచాలకులు డాక్టర్ వరప్రసాద్, పశువైద్యులు రమణమూర్తి, వీరబ్రహ్మం, నాగరాజు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఆర్ఓ పుల్లయ్య

అవుకు: పరిశ్రమలు స్థాపించే యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఆర్ఓ పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం అవుకు మండల పరిధిలోని సుంకేసులలో ఎన్విరాల్‌మెంట్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ మునిప్రసాద్, సీఐ తిమ్మారెడ్డితో కలిసి డీఆర్ఓ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. గొడవలు జరుగుతాయనే సమాచారంతో ముందస్తుగా పోలీసు బలగాలను రప్పించారు. లైమ్‌స్టోన్ స్లాబ్స్ బ్లాక్ గని సర్వేనెంబర్ 333/3, 333/2అ లోని 2.08 హెక్టార్లలో ప్రతిపాధిత క్వారీ లీజుకు చిలకల నారాయణ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గని సమీపంలోనే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు తమ అభిప్రాయాలు తెలిపారు. సర్పంచ్ కంభం వెంకట పద్మావతి పాఠశాలకు పరిశ్రమల యాజమాన్యం మినరల్ వాటర్ ప్లాంటు నిర్మించాలన్నారు. ఉపసర్పంచ్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ ఈ సర్వేనంబర్లలో చీకటి రాముడు అనే వ్యక్తికి ఎస్‌టీసీ ఉందని, కోర్టు కేసులో ఉన్నాయన్నారు. ఈ గనులు తమకు చెందినవని కొందరు తెలిపగా మరికొందరు క్వారీ లీజుకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ పర్యావరణానికి సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు రాలేదన్నారు.





జిల్లా కేంద్రం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో శనివారం జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాషా, రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తదితరులు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. డోన్ ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన రజినీ, అంజలీబాయి, బేతంచెర్ల కస్తూర్బా విద్యార్థిని లిఖితబాయి నగదు పురస్కారాలు అందుకున్నారు.